


# నమ్మకమే పెట్టుబడి

--నవీన్

"రాజన్న --మీ ప్రియశిష్యుడు --వెళ్ళిపోయాట్ట- మీకు తెలుసా?" అంటూ వచ్చాడు మా కొలీగ్ జనార్ధనరావు పొద్దున్నే.

"రాజన్న వెళ్ళిపోవటమేమిటి? నాకేమీ అర్ధంకావటం లేదు --" అన్నా న్నేను చదువుతున్న న్యూస్‌పేపర్ని పక్కన పెట్టేసి.

"మీకెందుకర్ధమౌతుందిలెండి...... నేనెన్నోసార్లు చెప్పాను- వాడిని నమ్మకండి అని... మీరు నా మాట విన్నారా? ఈ కాలనీలో నివసిస్తున్న ఎంతోమందినెత్తులమీద టోపీలు పెట్టేసి వాడు ఓ ఫైన్ మార్నింగ్ పెట్టేబేడా సర్దుకొని ఉడాయించేశాడు....." అన్నాడు జనార్ధనరావు.


"ఉడాయించటమేమిటి? అబసల్యూట్ నాన్‌సెన్స్! అతడెక్కడికీ ఉడాయించడు....రేపీపాటికి వచ్చేస్తాడు. ఈ మాట మీరు నాతో చెబితే చెప్పారు కానీ మరెవరితోటి చెప్పకండి..... ఓ అమాయకుడి మీద బురద చల్లకండి."

"వాడా! అమాయకుడా? వాడిని అమాయకుడంటున్న మీ అమాయకత్వాన్ని చూస్తే జాలేస్తోంది నాకు.... వాడు ఈ కాలనీలో నివసిస్తున్న ఓ వందమంది దగ్గర పెద్ద పెద్ద మొత్తాలలో అప్పులు చేసి ఓ 15 నుంచి 20 లక్షలదాకా చేతులో పట్టుకొని ఎక్కడికో దూరంగా పారిపోయాడని ఈ కాలనీ వాళ్ళందరికీ తెలిసి పోయింది... మీరేమో యింకా వాడు రేపీపాటికి వచ్చేస్తాడని చెబుతున్నారు" అన్నాడు జనార్ధనరావు.

హా అబ్బర్! రాజన్న అంటే నమ్మకానికి మంచితనానికి ప్రతీక అనుకునే వాడిని- రాజన్న నాకు పదేళ్ళుగా తెలుసు.... ఈ కాలనీలో నేను ఇల్లుకట్టినప్పుడే అతడు ఓ చిన్న కిరాణా దుకాణాన్ని ప్రారంభించాడు. చాలా చిన్న దుకాణం అది- ఉప్పు మిరపకాయ, ఉల్లిగడ్డలు, చింతపండు లాంటివి అమ్ముతుండేవాడు. కొత్తగా యేర్పడుతున్న కాలనీలో అదొక్కటే దుకాణం కాబట్టి చాలా త్వరగానే రాజన్న దుకాణం "ఇంతింతై వటుడంతై" అన్నట్టుగా పెరిగిపోయింది. రాజన్న బి.ఎస్.సి ఫస్ట్‌క్లాస్‌లో ప్యాసయ్యాడు- ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తే ఎక్కడా ఉద్యోగం దొరకలేదు.

"ఉద్యోగం దొరికేటట్టు లేదు- మన కాలనీలోనే చిన్న షాప్ పెడదామనుకుంటున్నాను సార్" అన్నడొకరోజు నా దగ్గరకొచ్చి.

"గో ఎహెడ్ మై బోయ్" అంటూ అతన్ని నేను ఉత్సాహపరిచాను. రాజన్నను చూస్తే నాకెంతో ముచ్చటవేసేది- ఎప్పుడూ యేదో చేస్తూనే వుండేవాడు- దుకాణం కొంచెం అభివృద్ధి కాగానే ఎల్.ఐ.సి ఏజన్సీ తీసుకున్నాడు. మా కాలనీలో వుంటున్న వాళ్ళందరూ ఉద్యోగస్తులే- ఇంటింటికి వెళ్ళి అందరితోనూ ఎంతో కలుపుగోలుగా వుంటూ చాలామంది చేత ఎల్.ఐ.సి పాలసీలను కొనిపించాడు. చాలా త్వరలోనే కిరాణా దుకాణాన్ని "రాజన్న



కిరాణా అండ్ జనరల్ స్టోర్స్" గా మార్చేశాడు- చాలా పెద్ద యిల్లు తీసుకొని త్వరలోనే తన దుకాణాన్నొక సూపర్ మార్కెట్‌గా రూపొందించాడు. కాలనీలో వుంటున్న వాళ్ళందరూ తప్పనిసరిగా తమకేది కావలసిన రాజన్న షాపులోనే కొనుక్కునేవాళ్ళు.

క్రమ క్రమంగా రాజన్న ఆకాలనీలో చాలా యెదిగిపోయాడు. అందరిచేత కష్టపడి పైకొచ్చాడన్న ప్రశంసల్ని పొందాడు- కాలనీవాసులకు తన దుకాణంద్వారా సరుకుల్ని అందించటమే కాకుండా అనేక ఇతరపనుల్ని కూడా చేసిపెట్టేవాడు. మీ గ్యాసుస్టౌ చెడిపోయిందనుకొండి- రాజన్నకు చెప్పండి. బాగుచేసేవాడిని తీసుకొచ్చి బాగుచేయించేవాడు. మీ ఇంట్లో ఒక పోర్షన్ ఖాళీగా ఉందనుకొండి- రాజన్నకు చెప్పండి- వెంటనే మీ ఇంటికి అద్దెకుండేవాళ్ళను తీసుకొచ్చేవాడు. మీరు ప్రతినెలా ఎల్.ఐ.సి కో, బ్యాంకులకో లేక ఇతరులకో కొన్ని పేమెంట్స్ చెయ్యవలసి వుంటుందనుకొండి. అవన్నీ నేను పే చేస్తానని రాజన్న ప్రతి ఇంటికివెళ్ళి వాళ్ళు ఎక్కడెక్కడ ఎవరెవరికి ఎంతెంత చెల్లించాలో తెలుసుకొని వాళ్ళిచ్చిన డబ్బు తీసుకొని సిన్సియర్‌గా ఆ డబ్బును ఎక్కడ చెల్లించాలో అక్కడ చెల్లించి అందుకు సంబంధించిన రశీదులను తెచ్చి ఎవరివి వాళ్ళకు యిస్తుండేవాడు- ఇలా ప్రతినెలా రాజన్న ప్రతి ఇంటినుండి వేలకొద్ది రూపాయల డబ్బు తీసికెళ్ళి చెల్లింపులన్నీ చేసి అందరికీ రశీదులు తెచ్చిచ్చేవాడు- నేను కూడా అతనికి ప్రతినెలా ఓ రెండు వేల దాకా నేను ఎక్కడెక్కడో చెల్లించాల్సిన మొత్తాన్ని యిస్తుండేవాడిని- ఈ పనులన్నీ రాజన్న అందరికీ ఫ్రీగా చేసిపెట్టేవాడు.

రాజన్న ఈ మధ్యనే మా కాలనీలో స్వంతంగా పెద్ద బిల్డింగ్ కట్టాడు, ఆ బిల్డింగ్ ఖరీదు పదిలక్షలైనా వుంటుందని అందరూ అంచనా వేశారు- గృహప్రవేశం చాలా గ్రాండ్‌గా జరిగింది. కాలనీలో వున్న చిన్న పెద్దా అందరూ వచ్చారు. రాజన్నకు ఓ 20వేల రూపాయల విలువచేసే ప్రెజెంటేషన్స్ వచ్చాయని చెప్పుకున్నారు.

ఇల్లుకట్టిన కొద్దిరోజులకే రాజన్న పెళ్ళి కూడా చేసుకున్నాడు- అతని భార్యకూడా చాలా తెలివైనదే. ఇతడు బయట తిరిగొస్తోంటే ఆమె షాపులోనే కూర్చొని వ్యాపారాన్ని చూసుకునేది.

రాజన్న ఇల్లు కట్టాక అతని వ్యాపారం ఇంకా అభివృద్ధి చెందింది- కిరాణా అండ్ జనరల్ స్టోర్స్‌తో పాటు కొన్ని లక్కీ స్కీమ్స్ స్టార్ట్‌చేశాడు- చిట్టీల బిజినెస్ స్టార్ట్‌చేశాడు ఇంత డబ్బు సంపాదిస్తున్నా అప్పుడప్పుడు నా దగ్గరకొచ్చి "ఓ వెయ్యి రూపాయలుంటే ఇవ్వండి సార్- రేపే ఇస్తాను " అంటూండేవాడు- నా దగ్గరుంటే యిచ్చేవాడిని- అన్నప్రకారం మళ్ళీ వెంటనే ఆ డబ్బు తిరిగి యిచ్చేసేవాడు- ఎప్పుడు చూసినా అతని జేబులనిండా డబ్బే వుండేది- ఒక్క జనార్థన్‌రావులాంటి వాళ్ళకు తప్ప ఎవరికీ అతనిమీద అనుమానం కల్గలేదు. జనార్థన్ రావు మాత్రం రెండుమూడుసార్లు నాతో అన్నాడు "వీడి ధోరణిచూస్తే ఎప్పుడో అప్పుడు వీడు అందర్నీ ముంచి పోయేట్టున్నాడు" అని.

"వాడు చాలా త్వరగా పైకొచ్చాడన్న జెలసీతో మీరలా మాట్లాడుతున్నారని" నేనన్నాను.

ఇవ్వాళ్ళ జనార్థనరావొచ్చి రాజన్న ఉడాయించేశాడని చెప్పినప్పటికి నేను అతని మాటను యేమాత్రం కూడా నమ్మలేదు. కానీ చాలా త్వరలోనే జనార్థనరావు చెప్పింది నిజమేనని తెలిసిపోయింది. రాజన్నను గూర్చి ఇది వరకు తెలియని చాలా విషయాలు ఇప్పుడు తెలిశాయి.

అతడు చాలామంది దగ్గర పెద్దమొత్తంలో అప్పులు చేశాడట- నెలకు నూటికి పదిరూపాయల చొప్పున వడ్డీ యిస్తానని చెప్పి భర్తలకు తెలియకుండా భార్యల దగ్గర, భార్యలకు తెలియకుండా భర్తల దగ్గర అప్పులు చేశాడట- అందరికీ అన్నంత వడ్డీని యిస్తుండేవాడట- ఎవరెవరి దగ్గర డబ్బు లున్నాయో, ఎవరెవరి సోర్సెస్ యేమిటో తెలుసుకొని వాళ్ళదగ్గర కెళ్ళి అప్పులు చేసేవాడట. ఆ మధ్య లెక్చరర్లకు ఒకేసారి ముప్పైనలుభై వేల ఆరియర్స్ వచ్చాయి. అప్పుడు వాళ్ళందరి దగ్గరా.... ముఖ్యంగా వాళ్ళ భార్యల దగ్గర అప్పులు చేశాడట- ఎల్.ఐ.సి లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి చనిపోతే అతని భార్యకు ఓ లక్షరూపాయల దాకా వచ్చాయుట. ఆమె దగ్గరకు వెళ్ళి ఆ లక్షరూపాయలు కాజేశాడట. ఇలా మొత్తం 15 లక్షల రూపాయల అప్పులు చేసి పారిపోయాడు. పోనీయ్ వాడి బిల్డింగ్ వుందికదా అనుకుంటే ఆ బిల్డింగ్‌ను ఆంధ్రభ్యాంకు వాళ్ళకు కుదవపెట్టి పదిలక్షలు అప్పు తీసుకున్నాడట.

పదేళ్ళుగా ఎంతో సన్నిహితంగా మెలిగిన మనిషి ఇంత మోసం చెయ్యగలడంటే నేనిప్పటికీ నమ్మలేకపోతున్నాను.

"యేమైనా మీరే తెలివైన వారండీ జనార్ధనరావుగారూ! అన్నాను నా ఓటమిని వప్పుకుంటూ.

"నేను ఎంత తెలివైన వాన్నయితే ఏం లాభమండి బాబూ! నా భార్య నాకు తెలియకుండా వాడికి పదివేలిచ్చిందట! ఆ పదివేలూగోవిందా!" అన్నాడు జనార్ధనరావు తలపట్టుకొని కళ్ళకునీళ్ళు తెచ్చుకుంటూ.



